క్లుప్తంగా

'విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి'



గోడకు వినతిపత్రం అంటిస్తున్న నాయకులు

జగిత్యాల: ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. స్థానిక ఎమ్మార్సీ ఎదుట బుధవారం ఆందోళన చేశారు. అనేక పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని, అయినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యార్థి సంఘాలు ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదని పేర్కొన్నారు. కార్యాలయం ఎదుట ఆందోళన చేసినా అధికారులు రాకపోవడంతో గోడకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశీ, అరుణ్, భూమేశ్, పవన్, సోహెల్, సంజయ్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు కలిగించొద్దు



నీటి సరఫరాను పరిశీలిస్తున్న శ్రీనివాస్

జగిత్యాల: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగనివ్వొద్దని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పలు వార్డుల్లో మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా చేయాలని, నీటిలో క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించి మంచినీటిని అందించాలని సూచించారు. ఆయన వెంట కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో

రాయికల్: స్వచ్ఛతపై దృష్టి సారించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో మండలస్థాయి స్వచ్ఛ భారత్ రెండోదశ కార్యక్రమంపై వివిధ గ్రామాల సర్పంచులు, ఆశా కార్యకర్తలు ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా తడి, పొడి చెత్తను వేరుచేసేలా చర్యలు చేపట్టాలని, ప్రతి ఇంటి ముందు ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, ఏపీఎం చక్రవర్తి, ఏపీవో దివ్య, సర్పంచులు గంగారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ రవి కిరణ్ కుమార్ పరిశీలించారు. మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, యామాపూర్, ఫకీర్ కొండాపూర్,వేములకుర్తి, బర్దీపూర్, మూల రాంపూర్, ఎర్దండి, కొజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నీటి వసతి, విద్యుత్, మూత్రశాలలు, గాలి, వెలుతురు మొదలైనవి ఉన్నాయో లేవో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లోను ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో గంటల ప్రాతిపదికన బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ బుధవారం తెలిపారు. పీజీటీ తెలుగు, పీజీటీ ఇంగ్లిషు, పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ హిందీలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టీజీటీలో బోధించేందుకు డిగ్రీ, బీఈడీతో పాటు టెట్ పాసై ఉండాలని, పీజీటీలో పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలని ఇంగ్లిష్ మీడియంలో బోధించేవారికి అర్హత ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

జగిత్యాల/ జగిత్యాల అగ్రికల్చర్/ కోరుట్ల/ కోరుట్ల రూరల్/ధర్మపురి/ కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్ /రాయికల్/ మల్యాల/ పెగడపల్లి/ మెట్‌పల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవంను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో యోగా వేడుకలు నిర్వహించారు. యోగాసనాలు వేయించి, యోగాతో కలిగే లాభాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పలు ప్రభుత్వ పాఠశాలలు, అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



కోరుట్లలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పెగడపల్లి కేజీబీవీలో విద్యార్థినుల ఆసనాలు



జగిత్యాల వ్యవసాయ కళాశాలలో..

ఊరూరా ఆధ్యాత్మిక దినోత్సవం



కోరుట్ల వేంకటేశ్వర ఆలయంలో అధికారుల పూజలు



పెగడపల్లిలో ప్రజాప్రతినిధుల పూజలు



రాఘవపేట హనుమాన్ ఆలయంలో నాయకుల పూజలు



అమ్మక్కపేటలో ఎంపీడీవో పూజలు

కోరుట్ల/ కోరుట్ల రూరల్/ పెగడపల్లి/ కథలాపూర్/ ఇబ్రహీంపట్నం/ జగిత్యాల రూరల్/ కొండగట్టు/ మల్లాపూర్: తెలంగాణ అవతరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పలుచోట్ల హోమం జరిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

సీఎం పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా బుధవారం దుబ్బరాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, అభిషేకం అనంతరం ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రం ఘననీయమైన అభివృద్ధి సాధించిందని, రానున్న కాలంలోను ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు సంతోషంగా, అభివృద్ధి దిశలో సాగాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా 16 దేవాలయాలను ప్రభుత్వం దూప దీప నైవేద్యం కింద ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారుఆయన వెంట ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, ఆలయ ఈవో కోస్న కాంతారెడ్డి, జిల్లా అధికారి సాయిబాబా, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన అధికారులు

దుబ్బరాజన్న ఆలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారికి విశేష ఫల పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయంలోని మంటపంలో ప్రత్యేక భజనా కార్యక్రమాలు జరిగాయి.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాయికల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని మసీదులో ముస్లిం సోదరులు, కుమ్మరిపల్లి గ్రామంలోని చర్చిలో క్రైస్తవులతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం రాయికల్ మండలం ధర్మాజీపేట గ్రామానికి చెందిన సుమారు 20 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ధర్మాజీపేట సర్పంచ్ హరీశ్, మండల యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: తెలంగాణ సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో కూడా జయశంకర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.

రాయికల్‌లో..

రాయికల్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి రాయికల్‌లో వెంకటేశ్వర విశ్వబ్రాహ్మణ మన్మయ సేవ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీగద్దె రాజు, కో–ఆప్షన్ మెంబర్ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గట్టుపల్లి మహేశ్, కోశాధికారి నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



జెడ్పీటీసీకి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ ప్రతినిధులు

మల్లాపూర్: గల్ఫ్ వెళ్లిన కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.500 కోట్లతో గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని గల్ఫ్ జేఏసీ ప్రతినిధి అట్టిపల్లి ఆదిరెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలో గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉన్న ఊరిలో పనిలేక ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వలస జీవుల వెతలు తీరాలంటే కేంద్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రకటించాలని సూచించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని, గల్ఫ్‌లో చనిపోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ ప్రతినిధులు ఏశాల సోమేశ్ పల్లికొండ రమేశ్, రవీందర్‌రెడ్డి, ఉప్పులూటి రాజేందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

సారంగాపూర్: తెలంగాణ ఏర్పడకముందు, ఏర్పడిన తరువాత గల్ఫ్‌లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి గురువారం జరిగే మండల సర్వసభ్య సమావేశాల్లో తీర్మానం చేయాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ బుధవారం బీర్‌పూర్, సారంగాపూర్ ఎంపీపీలు, జెడ్పీటీసీలకు వినతిపత్రాలు అందజేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇప్పటి వరకు గల్ఫ్ కార్మికులు 1800 మంది గల్ఫ్ మృతిచెందారని, ప్రభుత్వంఇచ్చిన హామీ మేరకు రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. గురువారం జరిగే బీర్‌పూర్, సారంగాపూర్ మండల సర్వసభ్య సమావేశాల్లో ఈ తీర్మానాలు చేయాలని ఎంపీపీలు మసర్తి రమేశ్, కోల జమున, జెడ్పీటీసీలు పాత పద్మ, మేడిపల్లి మనోహర్‌రెడ్డికి వినతిపత్రాలు అందించారు.

సహకార సభ్యులకు రూ.51 లక్షల రుణాలు పంపిణీ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ. 51 లక్షల రుణాలను సంఘ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రుణాలను శాశ్వతంగా ఉండే అభివృద్ధి పనులకు వెచ్చించాలని సూచించారు. సంఘం నుండి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సీఈవో రామానుజాచారీ, ఉపాధ్యక్షుడు శీలం సురేందర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ మోహిజ్ పాషా, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు



సతీశ్,ఎస్సై

పెగడపల్లి: పెగడపల్లి మండల ఎస్సైగా సీహెచ్ సతీశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కుమారస్వామి మల్యాలకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కోరుట్లలో ఎస్సైగా ఉన్న సతీశ్ ఇక్కడికి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

కథలాపూర్ ఎస్సై..



కిరణ్‌కుమార్, ఎస్సై

కథలాపూర్: మండల ఎస్సైగా పబ్బ కిరణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై శ్వేత వెల్గటూర్ మండలానికి బదిలీ కాగా, రాయికల్ ఎస్సైగా పనిచేసిన పబ్బ కిరణ్‌కుమార్‌ను కథలాపూర్ ఎస్సైగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

నాయకుల సన్మానం

కోరుట్ల: కోరుట్ల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్‌ను బీఎస్పీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్, మండల అధ్యక్షుడు మారంపెల్లి శ్రీధర్, కార్యదర్శి శనిగారపు ప్రశాంత్, బాలరాజ్, అక్షయ్, రాజేశ్, నవీన్ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ వేయాలి



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జగిత్యాల: ఉద్యోగులకు, పెన్షనర్లకు రెండో పీఆర్సీ 2023 జులై 1 నుంచి రావాల్సి ఉన్నందున పీఆర్సీ కమిటీని నియమించాలని పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సోమవారం ఒక డీఏ విడుదల చేసినా ఇంకా రెండు పెండింగ్‌లో ఉన్నాయని, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు సత్వరమే క్లియర్ చేయాలని కోరారు. జులై 1 నుంచి మధ్యంతర భృతి ప్రకటించి సంతృప్తికరంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. సమావేశంలో విజయ్, హన్మంతరెడ్డి, రఘుపతి, విశ్వనాథ్, ప్రకాశ్, సత్యనారాయణ, రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

నేడు ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభు బుధవారం తెలిపారు. ఎంపీపీ , జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సింగిల్‌విండో చైర్మన్లు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

'రోడ్డు పనులెందుకు ప్రారంభించలేదు?'

కథలాపూర్: మేడిపెల్లి– గోవిందారం డబుల్ రోడ్డు పనులకు నిధులు మంజూరై ఏడాదైనా.. పనులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రారంభించకపోవడంలో ఆంతర్యమేమిటని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కరండ్ల మధుకర్ ప్రశ్నించారు. బుధవారం మేడిపెల్లి మండలకేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. మేడిపెల్లి నుంచి గోవిందారం వరకు డబుల్ రోడ్డు కోసం ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఏడాది క్రితం రూ. 20 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ పనులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ఇరుకు రోడ్డుతో తరుచుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు కనిపించడం లేదా అని దుయ్యబట్టారు. రోడ్డు పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించిన స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రోడ్డును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి, మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

తాళ్ల చెరువు 40 ఫీట్ల రోడ్డు అనుమతి రద్దు చేయాలి

కోరుట్ల: పట్టణంలోని తాళ్ల చెరువు ఫుల్ ట్యాంకు 40 ఫీట్ల రోడ్డు అనుమతి రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం చెరువు వద్ద ధర్నా చేపట్టారు. సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ అనుమతి తీసుకోకుండానే 40 ఫీట్ల రోడ్డుకు అనుమతి ఇవ్వటం సరికాదన్నారు. కోరుట్ల ప్రణాధారమైన తాళ్ల చెరువు 64 ఎకరాల విస్తరణ ఉందన్నారు. చెరువుతో పట్టణంలో భూగర్బ జలాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికైనా రోడ్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెన్నా విశ్వనాథం, పట్టణ కార్యదర్శి రాధ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు, అందె రామయ్య, రాంబాబు, పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు కసరత్తు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో వివిధ పనులు చేపట్టిన వాటికి సామాజిక తనిఖీలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సామాజిక తనిఖీ అధికారుల బృందం సమావేశమై రికార్డులు పరిశీలించారు. గురువారం నుంచి గ్రామాల్లో అధికారుల బృందం తనిఖీలు చేపట్టనుంది.

రూ. 12 కోట్ల పనులకు సామాజిక తనిఖీలు.

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. ఉపాధిహామీ పథకంలో మండలంలో ఫిబ్రవరి 2020 నుంచి మార్చి 2023 వరకు రూ. 12 కోట్ల వివిధ అభివృద్ధి పనులు చేశారు. కాగా మూడేళ్లుగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నారు.

సేవాకార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందాలి

మల్లాపూర్ : లయన్స్‌క్లబ్ సామాజిక, సేవాకార్యక్రమాలతో ప్రజల మన్ననలను పొందాలని లయన్స్ క్లబ్ గవర్నర్ సింహరాజు కోదండరాములు అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.అధ్యక్షుడిగా కనుక సంజీవ్, కార్యదర్శిగా తోట రాజరెడ్డి, కోశాధికారిగా ఎర్రి జైపాల్‌రెడ్డిలతో పాటు సభ్యులందరితో ప్రమాణస్వీకారం చేయించి విధులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ రవీందర్, ఎస్సై నవీన్‌కుమార్, రాయికల్ మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్, ఎంపీడీవో రాజశ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

కోరుట్ల: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ సంక్రమణ, జాగ్రత్తలను విద్యార్థులకు వైద్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీతారాణి, ఐసీటీసీ కౌన్సిలర్ మల్లికార్జున్, ఎస్ఎస్‌కే మేనేజర్ సంతోష్, విక్టర్, సంపూర్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి వాసవి, రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ నీరజ, మలికార్జున్ పాల్గొన్నారు.

ఆలయానికి ఎన్ఆర్ఐల విరాళం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధి కోసం బెహరన్ దేశంలో ఉంటున్న వలసజీవులు రూ. 30 వేలు విరాళంగా అందించినట్లు అర్చకులు సత్యనారాయణశర్మ బుధవారం తెలిపారు. బెహరన్ దేశంలో ఉంటున్న కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వివేకానంద సేవా సమితి ఏర్పాటు చేసుకున్నారు. సేవా సమితి తరుపున రూ. 30 వేలు విరాళం అందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

మల్లాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే వరకు శ్రమించాలని జగిత్యాల ఇంటర్ విద్యాధికారి (డీఐవో) నారాయణ అన్నారు. ఇంటర్ ఫలితాల్లో సీఈసీ జిల్లా టాపర్‌గా నిలిచిన గొల్లపల్లి రాహుల్‌ను బుధవారం అభినందించారు. విద్యార్థుల ప్రతిభ, కళాశాల అధ్యాపకుల మెరుగైన మార్గదర్శకత్వంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాహుల్‌ను కలెక్టర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కాలిక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మసమాజ్ పార్టీ ప్రచారం

బుగ్గారం: మండల కేంద్రంలో బుధవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ నేతృత్వంలో పార్టీ పరంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. సమాజంలోని పీడిత ప్రజల బాధలు తొలగించడమే ధ్యేయంగా డీఎస్‌పీ పార్టీ ఆవిర్భవించిందన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ ప్రచార కమిటీ సభ్యుడు రాజేశ్, పోషరాజు, తిరుపతి, చంద్రమౌళి, వంశీ, విష్ణు పాల్గొన్నారు.

గంగపుత్రుల సహకార సంఘం అధ్యక్షుడిగా కల్లెడ శేఖర్

రాయికల్: పట్టణంలోని గంగపుత్ర సహకార సంఘం అధ్యక్షుడిగా కల్లెడ శేఖర్, ఉపాధ్యక్షుడిగా కల్లూరి నారాయణ, కూనారపు భూమేశ్, ప్రధాన కార్యదర్శిగా దువ్వాక రాజిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా కల్లెడ శంకర్, తోకల నరేశ్, కోశాధికారిగా ఊట్నూరు సాయబ్ ఎన్నికయ్యారు.

ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రంజిత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: లయన్స్ క్లబ్ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడిగా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నోముల రంజిత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలకేంద్రంలోని నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సెక్రటరీగా రెబ్బటి రాజశేఖర్‌యాదవ్, ట్రెజరరీగా రాడే అశోక్, ఉపాధ్యక్షులుగా పుప్పాల నర్సయ్య, గూడ అనంత్‌రెడ్డి నియమించారు. నూతన కార్యవర్గాన్ని లయన్స్ క్లబ్ జిల్లా సెకండ్ గవర్నర్ కోదండరాం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ జోనల్ చైర్‌పర్సన్ గంగుల మురళి, మధుసూధన్‌రెడ్డి, బద్రీశం, ఎలేటి చిన్నారెడ్డి, ఆలిశెట్టిమోహన్, జింక శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయికల్ అధ్యక్షుడిగా కొమ్ముల ఆదిరెడ్డి

రాయికల్: లయన్స్‌క్లబ్ రాయికల్ అధ్యక్షుడిగా కొమ్ముల ఆదిరెడ్డి, సెక్రటరీగా మోసారపు శ్రీకాంత్, కోశాధికారిగా గంట్యాల ప్రవీణ్ ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బహుజన వలంటరీ ఫోర్స్ కన్వీనర్‌గా బాలరాజు

మెట్‌పల్లి: బీఎస్పీ అనుబంధ బహుజన వలంటరీ ఫోర్స్ నియోజకవర్గ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన రాంపల్లి బాలరాజును నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బుధవారం జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి ఆయనకు అందజేశారు. తొందరలోనే అన్ని కమిటీలను వేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామని లింబాద్రి పేర్కొన్నారు.